క్లుప్తంగా

పేదలకు సాయం చేసేందుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పేదలకు ఆర్థిక సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి హామీనిచ్చారు. నర్సాపూర్ మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు.

గణిత ఫోరం మండల కమిటీ ఎన్నిక



గణిత ఫోరం కమిటీ సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని గణిత ఉపాధ్యాయులతో గణిత ఫోరం కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా నాగుల్‌మీరా(సలాబత్‌పూర్), ప్రధాన కార్యదర్శిగా కమ్మరి నరేందర్(కౌడిపల్లి), కోశాధికారిగా కె. కవిత(రాయిలాపూర్), సభ్యులను ఎన్నుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం



స్వామివారి కల్యాణ వేడుకలో మాధవానంద స్వామి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట వేంకటాద్రిపై కొలువైన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం భక్తులు మంజీరా నది నుంచి జలాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం హోమం చేపట్టారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కల్యాణ మంటపంలో వేదపండితులు కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద స్వామి హాజరయ్యారు. కల్యాణాంతరం స్వామి, అమ్మవార్లకు మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం గిరిప్రదక్షణ, పల్లకిసేవ నిర్వహించారు.

ముగిసిన సప్తాహ



సప్తాహలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: మండల పరిధి బాణాపూర్‌లోని శ్రీరుక్మిణి పాండురంగ ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన 22వ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం శనివారం ముగిసింది. చివరి రోజున ప్రవచనకారులు ప్రవచనం, హరిపాల్, కీర్తన, మరాఠి, తెలుగులో భజనలు, కాకడహారతి, గాథపూజ, తీర్థ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్ పల్లిలో బీరప్ప- కామారతి కల్యాణ మహోత్సవాలు రెండవ రోజు శనివారం కొనసాగాయి. గంగకు పోయే కార్యక్రమంలో భాగంగా భక్తులు గంగవైపు పయనించారు.

శుద్ధిజలం నేల పాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా చాలా ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీల వల్ల నీరు వృథాగా పోతుంది. శనివారం ఉదయం మండల పరిధి గంగ్వార్ గ్రామ శివారులో అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా శుద్ధి జలం వృథాగా పారుతోంది.

మొక్కంటే.. 'లెక్క' లేదు

- అస్తవ్యస్తంగా నర్సరీల నిర్వహణ
- నిధులు ఖర్చు తప్ప మొక్కల పెంపకం ఏదీ?
- సోషల్ ఆడిట్‌లో వెలుగుచూస్తున్న అక్రమాలు



మందాపూర్ నర్సరీలో మొలకెత్తని మొక్కలు



చిల్వెర నర్సరీలో ఎండిపోతున్న మొక్కలు

అల్లాదుర్గం(మెదక్): నాటిన మొక్కలకు లెక్క లేదు.. పెంచే మొక్కలకు దిక్కులేదు అన్నట్లు ఉంది పరిస్థితి. రూ. లక్షలు ఖర్చుపెడుతున్న ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోతున్నా తప్పుడు రికార్డులతో ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. పర్యవేక్షణ కొరవడి నిధులు పక్కదారి పడుతున్నాయి. ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌లో ఏటా అక్రమాలు వెలుగు చూస్తున్నా జరిమానాలు కట్టకపోగా, రికవరీ డబ్బులు చెల్లించడం లేదు.

మండలంలో 16 పంచాయతీలు

అల్లాదుర్గం మండలంలో 16 పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీలో నర్సరీని ఏర్పాటు చేశారు. అందులో ఉపాధి హామీ నిధులతో 10 వేల చొప్పున మొక్కలు పెంచాల్సి ఉంది. రికార్డులు సైతం అవే చెబుతున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో చూస్తే నర్సరీలలో సగం మొక్కలను కూడా పెంచడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మందాపూర్ నర్సరీలో సగం మొక్కలు మొలకెత్తలేదు. ఉన్న మొక్కలకు సరిగా నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. చిల్వెర నర్సరీలో సైతం మొక్కలు ఎండిపోయాయి. రెడ్డిపల్లి నర్సరీలో సైతం విత్తనాలు మొలకెత్తలేదని స్థానికులు చెబుతున్నారు. మండలంలో నర్సరీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, జిల్లా, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించడం లేదనే విమర్శలున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడుతూ జిల్లాస్థాయి అధికారులను మచ్చిక చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా నిర్వహిస్తున్న ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌లో అక్రమాలు వెలుగుచూస్తున్నా చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం అంటున్నారు.

రికవరీ లేదు.. జరిమానా చెల్లించలేదు

మండలంలో 1-04-2023 నుంచి 31-03-2024 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో పలు విషయాలు వెలుగు చూశాయి. కొలతలు చేయకుండా, ఇళ్లను చూపి, పశువుల షెడ్‌ల పేరుతో, పనులు చేయకున్నా బినామీ పేర్లపై నిధులు స్వాహా చేశారు. మొక్కలు ఎండిపోవడం, చనిపోయిన కూలీల పేర్లపై డబ్బులు మంజూరు అయ్యాయి. సామాజిక తనిఖీలో అక్రమాలు బయటపడ్డాయి. దీంతో అధికారులు సుమారు రూ. 3 లక్షల 74 వేలు రికవరీకి, మరో రూ. 59,100 జరిమానా విధించారు. అయితే అక్రమాలకు పాల్పడిన సిబ్బంది ఇప్పటివరకు చెల్లించలేదు. జనవరి 2019 నుంచి ఫిబ్రవరి వరకు జరిగిన పనుల్లోనూ భారీగానే అక్రమాలు చోటు చేసుకున్నాయి. సిబ్బంది నుంచి రూ. 2లక్షల 96 వేల రికవరీ, రూ. 69 వేలు జరిమానా వేశారు. ఇప్పటివరకు ఆ డబ్బులు చెల్లించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు ఉపాధి పనులనూ పర్యవేక్షిస్తూ అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంబేడ్కర్ భవనం నిర్మించాలి

దళిత సంఘాల నాయకుల డిమాండ్



ఐక్యత చాటుతున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవనాన్ని తక్షణమే నిర్మించాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో దళిత సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని కులవర్గాల సంఘాలకు సామూహిక భవనాల నిర్మాణ పనులు పూర్తవుతున్నా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనం కనీసం స్థల సేకరణ కార్యాచరణ కూడా చేపట్టడం లేదని మండిపడ్డారు. పదేళ్లుగా నిలిచిపోయిన భవన పనులను వెంటనే చేపట్టాలని కోరారు. భవన నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే రోహిత్ చొరవ తీసుకొని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించాలన్నారు. భవనం లేకపోవడం వివక్షతతో నిర్లక్ష్యానికి గురవుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చెట్లపల్లి యాదగిరి, మూసాయిపేట యాదగిరి, మురళిమాదిగ, అస్తరుగళ్ల బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను గుర్తించాలి

మండల విద్యాధికారి వెంకటేశం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం

పెద్ద శంకరంపేట(మెదక్): మహిళా నిరక్షరాస్యులను గుర్తించాలని మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. శనివారం పేటలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం చేపట్టామన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేయని వారిని గుర్తించి వారితో ఓపెన్ విద్యా విధానం ద్వారా చదువు పూర్తి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఈపీఎం గోపాల్ సీసీలు, సీఏలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

సేవాభావాన్ని చాటుకున్న 108 సిబ్బంది



కౌడిపల్లి: మృతుని కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న 108 సిబ్బంది

కౌడిపల్లి (నర్సాపూర్): 108 సిబ్బంది తమ సేవాభావాన్ని చాటుకున్నారు. సహచర సిబ్బంది ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో మృతుని కుటుంబానికి రూ 1.57లక్షలు ఆర్థిక సహాయం అందించారు. కౌడిపల్లి మండలం మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్ 108 పైలట్‌గా పనిచేసేవాడు. ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందాడు. దీంతో మెదక్ జిల్లాతోపాటు వివిధ జిల్లాలకు చెందిన 108పైలట్స్, మెడికల్ టెక్నీషియన్స్ కలిసి శనివారం మృతుని కుటుంబానికి రూ 1.57లక్షలు అందచేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, జాకబ్, దుర్గాప్రసాద్, నవీన్, చాంద్‌పాష, ప్రవీణ్‌యాదవ్, వెంకటేశ్,రాజు, శ్రీహరి, మాన్య, నర్సింలు, రాజు,నరేశ్,రమ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ పంటలపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు ఆధునీకతతో కూడిన సాగుతో పాటు, పరిస్థితులను బట్టి పంటలు వేయాలని వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్తలు వినయ్, శ్రీనివాస్ రైతులకు సూచించారు. అలాగే పంటలకు అవసరం మేరకే రసాయనాలు వాడాలన్నారు. శనివారం మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్గానిక్ పంటలు, ఆయిల్‌పామ్ సాగు, రసాయనాల వాడకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫాం అధికారి అశోక్, వెటర్నరీ డాక్టర్ లక్ష్మి, ఏఈఓ సచిన్, కార్యదర్శి స్వామిగౌడ్, పలువురు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పాపన్నపేట(మెదక్): నిత్యం భగవంతుడి సేవ వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి ఉమామహేశ్వర కేదారీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడుతూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భూమయ్య దంపతులు ,అర్చకులు రాజశేఖర్ శర్మ, నర్సింలు గుప్త, ఇంద్రసేనా రెడ్డి, రవీందర్ గుప్త, ప్రసాద్, నర్సింలుగౌడ్, రవీందర్, భూషణం, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఈజీఎస్ అధికారుల ఆధ్వర్యంలో సోషల్ అడిట్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ పనులు, ఉపాధి హామి కూలీల హక్కులు, విధులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి , అడిట్ అధికారులు, మాజీ సర్పంచ్ నత్తిమల్లేష్, కార్యదర్శి ప్రియాంక, ఏపీఓ ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

20న వేలం పాట

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయాల కోసం ఈ నెల 20న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఉ. 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనే వారు లక్ష రూపాయలు డిపాజిట్‌తో పాటు పాస్ ఫొటో , బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్, పోస్ట్ డేటెడ్ రెండు చెక్కులు, వంద రూపాయల బాండ్ పేపర్ అందజేసి పాల్గొనాలన్నారు.

వేసవి శిబిరంతో ఉత్సాహం



విద్యార్థులతో ఎంఈఓ బాలరాజు

ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): వేసవి శిబిరం విద్యార్థుల్లో ఉత్సాహం నింపిందని ఎంఈఓ బాలరాజు అన్నారు. శనివారం మండలం కౌడిపల్లిలో వేసవి శిబిరం ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదిహేను రోజుల పాటు విద్యార్థులకు యోగా, చిత్రలేఖనం, క్రీడలు, కంప్యూటర్‌పై శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాజిద్‌అలి, ట్రైనర్లు సత్యం, కరుణాకర్, యాదగిరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారంలో పెద్దమ్మ తల్లి వార్షికోత్సవానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నాయకులు సాన సత్యనారాయణ, రాజిరెడ్డి, అరుణ ఉన్నారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు లక్ష్మణ్, నాగరాజు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



పెద్దశంకరంపేట(మెదక్): కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలో వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదేశించారు. మండల పరిధిలోని జూకల్, వీరోజిపల్లి, పెద్దశంకరంపేట, చీలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రైతుల నుంచి వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నందున త్వరగా ధాన్యాన్ని సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట కార్యాలయ సిబ్బంది, రైతులు ఉన్నారు.



చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

ధాన్యం తూకం వెంటనే వేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కాంటాను వేగవంతం చేయాలని చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ ఆదేశించారు. చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి, అంబాజీపేట, రుద్రారం, జంగరాయి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వెంటవెంటనే తరలించాలన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఏసీఎస్, ఐకేపీ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

వేసవి శిక్షణ శిబిరాల ముగింపు



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశం

పెద్ద శంకరంపేట(మెదక్): వేసవి శిక్షణ శిబిరాల్లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు భవిష్యత్‌లో సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. 15 రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్ కుమార్, లక్ష్మణ్, వెంకట్, ఉమా ప్రసన్న, ప్రభాకర్, ఎంఐఎస్‌సీ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

పని బంద్ చేసిన ఉపాధి కూలీలు

ఫీల్డ్ ఆఫీసర్‌పై ఆగ్రహం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకంతో పనికి వచ్చిన ఉపాధి కూలీలు వెనుతిరిగిన ఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 150 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పని చేసి హాజరు కోసం గంటల తరబడి వేచి చూడవలసిన పరిస్థితి నెలకొంది. తాను వచ్చేంత వరకు వేచి ఉండాలంటూ ఫీల్ అసిస్టెంట్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కూలీలు వాపోయారు. పనిచేసే చోట ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు పనికి తగ్గ కూలీ డబ్బులు ఇవ్వాలని, సౌకర్యాలు కల్పిస్తేనే పనిచేస్తామంటూ పనులు బంద్‌చేసి వెను తిరిగారు.

సంక్షిప్త వార్తలు

◆ భూసార పరీక్షలు తప్పనిసరి

తూప్రాన్: భూసార పరీక్షల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్‌లో రైతులకు వానాకాలం పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడకం, రసాయన పురుగు మందులు వాడడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంగమల్లు, విస్తరణ అధికారి సంతోష్, రైతులు పాల్గొన్నారు.

◆ ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంవద్ద భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. పురోహితుడు ఉమాశంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

◆ ఉత్సవాలకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని నల్లవల్లి గ్రామంలో శనివారం నుంచి 20 వరకు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా పాల్గొనాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డిని శనివారం గ్రామస్తులు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, రాజుగౌడ్, హరిబాబు, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ఇష్టానుసారంగా వెళ్లడంతో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



నర్సాపూర్ చౌరస్తాలో సిగ్నల్స్ పని చేయకపోవడంతో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

నర్సాపూర్ : జాతీయ రహదారిపై నర్సాపూర్ చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని రోజులుగా పని చేయడం లేదు. సిగ్నల్స్ నిర్వహణ బాధ్యత తమది కాదని ఇరు శాఖల అధికారులు చెప్పడం గమనార్హం. కాగా ఇటీవల సిగ్నల్స్‌కు మరమ్మతులు చేసినా సరిగా పని చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కోసారి రెడ్ లైట్ వచ్చి అలాగే ఉంటుందని ఎల్లో, గ్రీన్ లైట్ రాకపోవడంతో చాలాసేపు తమ వాహనాలు ఆపాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్స్ పనిచేయక వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సిగ్నల్స్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఇరు శాఖల మధ్య వ్యవస్థ ఆగమాగం..

స్థానిక చౌరస్తాలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను మున్సిపాలిటీ అధికారులు నిర్వహించాలని పోలీసులు చెబుతుండగా తమకేమి సంబంధం లేదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. సిగ్నల్స్ పని చేయని విషయాన్ని స్థానిక ఎస్‌ఐ లింగం దృష్టికి తీసుకెళ్లగా వాటి నిర్వహణను మున్సిపల్ అధికారులకు అప్పగించామని, పాడైతే మరమ్మతులు వారు చేయించాలని చెప్పారు. ఇదిలా ఉండగా ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా సిగ్నల్స్ నిర్వహణ తమకు సంబంధం లేదని, పోలీసు శాఖ చూసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అయినా ఇటీవల మరమ్మతులు చేయించామని, ఏదైనా సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రెండు విధాలుగా చెప్పడం గమనార్హం.

చౌరస్తాలో గుంతలకు మరమ్మతులు చేయాలి

చౌరస్తాలో తూప్రాన్ వైపు రోడ్డుపై గుంతలు ఏర్పడగా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. గుంతలలో వేసిన సిమెంట్ కొట్టుకుపోవడంతో పెద్దగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో సిమెంట్ వేసి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.